కృషి విజ్ఞాన కేంద్రం బులెటిన్ - 3

# పశు సంపద నుండి అధికోత్పత్తికి ఆధునిక శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు



డి.బి.వి. రమణ, ఎ.కె. మిశ్ర, జి. నిర్మల,
ఎమ్.ఎస్. ప్రసాద్ మరియు వై.యస్. రామకృష్ణ

ICAR

కృషి విజ్ఞాన కేంద్రం

కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ

సంతోష్‌నగర్, సైదాబాద్ P.O., హైదరాబాద్ - 500 059.

# కృషి విజ్ఞాన కేంద్రము
# కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ

| క్రమ సంఖ్య | ఉద్యోగస్తుని పేరు | హోదా |
|---|---|---|
| | డా॥ వై.వి.ఆర్. రెడ్డి | కార్యక్రమ అధ్యక్షులు |
| 1. | ఎమ్.ఎస్. ప్రసాద్ | కార్యక్రమ నిర్వాహకులు |
| 2. | ఎ. సామ్రాజ్యం | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (గృహ విజ్ఞానము) |
| 3. | ఆర్. జోసెఫ్ | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (వ్యవసాయ విస్తరణ) |
| 4. | పి.ఆర్. సింగ్ | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (ఉద్యానశాస్త్రం) |
| 5. | పి.కె. మథాడ్ | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (యంత్రాలు మరియు వ్యవసాయ పరికరాలు) |
| 6. | ఆర్.డి. రామిరెడ్డి | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (సస్యరక్షణ) |
| 7. | ఎస్.ఎం. విద్యాశేఖర్ | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (వ్యవసాయ శాస్త్రము) |
| 8. | ఎ. విద్యాధరి | సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ (గృహ విజ్ఞానము) |

కృషి విజ్ఞాన కేంద్రం బులెటిన్ - 3

# పశుసంపద నుండి అధికోత్పత్తికి ఆధునిక శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు

డి.బి.వి. రమణ
ఎ.కె. మిశ్ర
జి. నిర్మల
ఎమ్.ఎస్. ప్రసాద్
వై.యస్. రామకృష్ణ

భాకృఅనుప
ICAR

కృషి విజ్ఞాన కేంద్రం
కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ
సంతోష్‌నగర్, సైదాబాద్ P.O., హైదరాబాద్ – 500 059.

2007

కూర్పు మరియు సంకలనము : రమణ, డి.బి.వి., మిశ్ర, ఎ.కె., నిర్మల, జి., ప్రసాద్, ఎమ్.ఎస్., రామకృష్ణ, వై.యస్., 2007. పశుసంపద నుండి అధికోత్పత్తికి ఆధునిక శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు (బులెటిన్–3/2007) కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, హైదరాబాద్. 24 పేజీలు.

మార్చి 2007

© సర్వ హక్కులు ప్రచురణ కర్తలవి

ప్రచురణ :

**డా॥ వై.యస్.రామకృష్ణ**
సంచాలకులు
కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధన సంస్థ
సంతోష్ నగర్, హైదరాబాద్ – 500 059.
ఫోన్ : 040-2453 0177 (O), 2453 2262 (R)
ఫ్యాక్స్ : 040-2453 1802 / 2453 5336
ఇ–మేయిల్ : root@crida.ernet.in
వెబ్ : http://crida.ernet.in

Printed at : **Sree Ramana Process Pvt. Ltd.,**
S.D. Road, Secunderabad - 500 003. Phone : 040-27811750

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | వివరములు | పేజి నెం. |
|---|---|---|
| 1. | పశువులు, జీవాలు, కోళ్ళ జాతులు మరియు ఎంపిక | 05 |
| 2. | పశుగ్రాస రకాలు మరియు ఉత్పత్తి | 08 |
| 3. | పశువులు, జీవాలు మరియు కోళ్ళ సంఖ్య | 13 |
| 4. | పాడి పశువుల పోషణ | 14 |
| 5. | పాడి పశువుల పునరుత్పత్తి | 17 |
| 6. | లేగదూడల యాజమాన్యం మరియు పోషణ | 19 |
| 7. | పశువుల గృహవసతి | 20 |
| 8. | పశువుల ఆరోగ్య సంరక్షణ | 20 |
| 9. | జీవాల పోషణ మరియు యాజమాన్యం | 22 |
| 10. | పెరట్లో పెంచే కోళ్ళ పోషణ మరియు యాజమాన్యం | 23 |

# పశుసంపద నుండి అధికోత్పత్తికి ఆధునిక శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు

వ్యవసాయంలో పశుసంపద ముఖ్యమైన అంతర్భాగంగా ఉంటుంది. పశుసంపద వ్యవసాయం పైన ఆధారపడిన రైతుల పంటలకు అవసరమైన ఎరువును అందించి దిగుబడిని పెంచుటకు తోడ్పడుటయేగాక మనకు కావలసిన పౌష్టిక ఆహారాన్ని (పాలు, మాంసము మరియు గ్రుడ్లు), ఉపాధి సౌకర్యాలు మరియు ఆదాయాన్ని సంవత్సరము పొడుగున ఇస్తుంది. పశు ఉత్పాదన శక్తి ఆజాతి లక్షణాలు, బంజరు భూముల నుండి మరియు రైతుల పొలం నుండి లభించే పశుగ్రాసం, ఆ ప్రాంతంలో పశువుల సంఖ్య, వాతావరణ పరిస్థితులు మరియు రైతులు పాటించే యాజమాన్య పద్ధతులు మీద ఆధారపడి ఉంటుంది.

సాధారణంగా మధ్య తరగతి రైతు సముదాయంలో ఎక్కువగా దేశవాళి పాడిపశువులు ఉంటాయి. పాడిపశువుల పాలఉత్పత్తి సగటున 1-2 లీటర్లు కన్నా ఎక్కువ ఉండదు. చిన్నకారు, సన్నకారు రైతులకి దేశవాళి జీవాలు (గొర్రెలు, మేకలు) ఎక్కువగా ఉంటాయి. కాని వాటి పెరుగుదల మరియు ఉత్పాదన సామర్థ్యము తక్కువగా ఉంటుంది, వాటి బరువు సంవత్సరకాలంలో 15-20 కిలోల కంటే ఎక్కువ పెరగదు. చాల మంది రైతులు పశువులు, జీవాలతోపాటు తమ పెరట్లో దేశవాళి కోళ్ళు కూడ పెంచుకుంటుంటారు, కాని వాటి పెరుగుదల మరియు గ్రుడ్ల ఉత్పాదన సామర్థ్యము కూడ తక్కువగా ఉంటుంది. ఈ విధంగా తరతరాలుగా దేశవాళి నాసిరకం జాతుల పోషణ, పశుగ్రాసం కొరత, సమతుల్యమైన ఆహారపోషణ చేయకపోవటం, పరిశుభ్రమైన వసతి సౌకర్యాలు (పాకలు/కొట్టాము) లేకపోవడం, తీవ్రమైన జబ్బులు, సనాతన సాంప్రదాయ పశుయాజమాన్య పద్ధతులు మొదలైన వాటివల్ల రైతులు తమ పశువులు, జీవాలు మరియు కోళ్ళ నుండి పూర్తి స్థాయిలో ఉత్పాదన పొందలేకపోతున్నారు. అందువల్ల, ప్రతి రైతు కాలానికి అనుగుణంగా మేలైన అధిక ఉత్పాదన సామర్థ్యము గల జాతులను పెంచుకొని, ఆధునిక పశుయాజమాన్య పద్ధతులను పాటించి తమ పశుసంపద నుండి సుస్థిరమైన ఆదాయాన్ని వర్షాభావ పరిస్థితులలో కూడ పొందవచ్చును.

## పశువులు, జీవాలు మరియు కోళ్ళ జాతులు మరియు ఎంపిక

**పాడి పశువులు :** పాడి పరిశ్రమ నిర్వహణలో పశువుల ఎంపిక అతి ముఖ్యమైనది. పోషణ ఖర్చులు నాశి రకపు పశువులకు మరియు ఎక్కువ పాల దిగుబడి నిచ్చే పశువులకు దాదాపు సమానము. కావున లాభసాటిగా పాల ఉత్పత్తిని నిర్వహించాలంటే మేలు



ముర్రా జాతి గేద



హెచ్.ఎఫ్.జాతి ఆవు

జాతి పశువులనే ఎంపిక చేసుకోవాలి. తక్కువ పాలనిచ్చే దేశవాళి నాటు రకం పశువుల కంటే, ఎక్కువ పాలనిచ్చే మంచి జాతి గేదెలు మరియు ఆవుల పోషణ చేయాలి (గేదెలలో ముర్రా, సూర్తి, జఫర్ భాడి జాతులను, ఆవులలో సంకరజాతి ఆవులైన జర్సీ, హాలిస్టన్ మరియు బ్రౌన్ స్విస్‌లను ఎంచుకోవాలి). పశువుల శరీర లక్షణాలు, దాని సంతతి, ఉత్పత్తి సామర్థ్యములను ఆధారం చేసుకొని పాడి పశువులను ఎంపిక చేసుకోవాలి. పశువు సంతతి వివరాలు, ప్రభుత్వ ఫారాలలో లేదా పెద్ద పెద్ద ఫారాలలోనే దొరుకును కాబట్టి సాధారణంగా సంతలో కొనుగోలు చేసేటప్పుడు, పశువు శరీర లక్షణాలు, దాని పాల ఉత్పత్తి సామర్థ్యమును బట్టి కొనుగోలు చేయవలసి ఉంటుంది. మొదటి 5 ఈతలలోనే పాడి పశువులు గరిష్ఠ స్థాయిలో పాల దిగుబడిని ఇవ్వగలవు కావున మొదటి ఈత లేదా రెండవ ఈతలో ఉండి, ఈనిన నెలలోపు పశువులనే ఎంపిక చేసుకోవాలి. పశువును వరుసగా మూడురోజులు పాలు పితికి దాని పాల ఉత్పత్తి సామర్థ్యమును నిర్ధారణ చేయాలి. ఆరోగ్యమైన పశువులను, మచ్చికగా వుండి మన వాతావరణానికి అవాటుపడే పశువులనే ఎంచుకోవాలి;

## మేలుజాతి పాడి పశువు శరీర లక్షణాలు

* పాడి పశువు ఆడ లక్షణాలు కలిగి మచ్చిక బాగా అగునట్లు వుండాలి
* పశువుల శరీరము త్రికోణాకారంగా వుండాలి
* చర్మము పలుచగా, మృదువుగా వుండాలి
* కళ్ళు చురుకుగా, మెడ పొట్టిగా వుండాలి
* కడుపు పెద్దగా, డొక్కలు నిండుగా వుండాలి
* పొదుగు బాగా విస్తరించి శరీరానికి బాగా అతుక్కొని వుండాలి
* చనుకట్లు పొదుగుమీద సమానంగా అమరి వుండాలి
* పొదుగుకి ఇరువైపుల రక్తనాళాలు లావుగా, స్పష్టంగా కన్పించాలి

## జీవాలు (గొర్రెలు మరియు మేకలు) :

లాభసాటిగా ఉండే జీవాల పెంపకంలో అధిక మాంసోత్పత్తికి మేలు జాతి, ఆరోగ్యమైన జీవాలు తమ ప్రాంత వాతావరణానికి అనుగుణంగా రైతులు ఎంచుకోవాలి. జీవాలలో (గొర్రెలు/మేకలు) తక్కువ సమయంలో ఎక్కువ బరువు పెరిగే, అధిక రోగ నిరోధక శక్తి కలిగిన జాతులను ఎంచుకోవాలి. గొర్రెలలో నెల్లూరు (జోడ్పి, తెలుపు, గోధుమ రంగు), దక్కని, మాండ్య మొదలగు జాతులను, మేకలలో పాలమూరు, ఉస్మానాబాదీ, జమ్నాపరి, బార్బరి మొదలగు జాతులను ఎంపిక చేసుకోవాలి. జీవాలను సంతలలో ఎంపిక చేసుకోనేటపుపడు ఆజాతి శరీర లక్షణాలు, దాని సంతతి ఉత్పత్తి సామర్థ్యములను నిర్ధారణ చేసుకోవాలి లేదా తమకు దగ్గరలో వున్న ప్రభుత్వ ఫారాల నుండి కూడ పొందవచ్చును. రైతులు ఎంపిక చేసుకొనే జీవాలు చురుకుగా, పుష్టిగా ఉండాలి. సాధ్యమైనంత వరకు కవల పిల్లలుగా పుట్టిన, యుక్త వయస్సులో ఉన్న జీవాలను ఎంపికచేసుకోవాలి. జీవాలు రంగులోను, ఆకారంలోను, దేహధారుద్యములోను ఎంచుకున్న జాతి లక్షణాలను పొల్లు పోకుండా బలిష్ఠంగా ఉండి కాళ్ళు నిటారుగా, లావుపాటి ఎముక కలిగి ఉండాలి. ముఖముపైన, కళ్ళ చుట్టు ఉన్ని ఉండకూడదు. విత్తనపు పోట్టేలు పుష్ఠిగా, చురుకుగా, బలిష్ఠంగా, జీవకళ ఉట్టి పడుతు ఉండాలి. కనీసం, తమ వద్ద ఉన్న దేశవాళి జీవాలను పైన చెప్పిన జాతి విత్తనపు పోట్టేళ్లతో జతకలపాలి తద్వారా తర్వాత తరంలో మంచి జాతి లక్షణాలు ఉన్న పిల్లలు లభిస్తాయి.

**కోళ్ళు :** కోళ్ళలో వనరాజ/గిరిరాజ/ గ్రామ ప్రియ మొదలగు అభివృద్ధి పరచిన సంకరజాతి కోళ్ళు దేశవాళి కోళ్ళకు ప్రత్యామ్నాయముగా పెరట్లో పెంచుకోవచ్చు. వీటి ద్వారా తక్కువ పెట్టుబడితో సంవత్సరానికి 120-150 వరకు గ్రుడ్లను మరియు తక్కువ కాలంలో అధిక మాంసంను పొందవచ్చును.

# పశుగ్రాస రకాలు మరియు ఉత్పత్తి

సాధారణంగా బంజరు భూముల నుండి లభించే పశుగ్రాసం తక్కువ పోషక విలువలు కలిగి ఉంటుంది మరియు ఒకేసారి ఎక్కువ సంఖ్యలో పశువులు రోజు మేయటం వల్ల అక్కడ ఉన్న గడ్డి అంతగా పెరగదు. దీనివల్ల పశువులకు కావలసిన పోషకపదార్థములు తగినంత పరిమాణంలో లభించక పాడిపశువులలో ఉత్పాదన తగ్గిపోతుంది, పెయ్యలలో ఎదుగుదల మందగిస్తుంది, గేదెలలో ఎదలక్షణాలు కనబడవు. కాబట్టి, బంజరు భూములలో వర్షాలు పడేముందే సింకరస్, స్టైలో, స్వీట్ సూడాన్, రోడ్స్, సిరాట్రో లాంటి గడ్డి జాతుల విత్తనాలను చల్లి, అవి మంచిగా పెరిగేవరకు పశువులు మెయ్యకుండా ఆగ్రామంలోని ప్రజలందరు కట్టుబాటు చేసుకోవాలి. మొత్తం బంజరు భూమిని నాలుగు ప్రాంతములుగా విభజించుకొని, వరుసగా 15 రోజులు ఒక ప్రాంతంలో, ఆ తర్వాత మరొక ప్రాంతంలో పశువులను మేపాలి. ఈ విధంగా ప్రతి 15 రోజులకు మేసే ప్రాంతం మార్చడం వల్ల మొదట మేసిన ప్రాంతములోనికి మరల నెల రోజుల తర్వాత పశువులు వస్తాయి. ఈ నెలరోజుల వ్యవధిలో అక్కడ ఉన్న పచ్చిక గడ్డి బాగా పెరుగుతుంది.



స్టైలో హమట



లూసర్న్



మొక్కజొన్న

### పట్టిక 1 : పచ్చిమేత గడ్డి రకాల సాగు వివరములు

| సాగు వివరములు | నేపియర్ | పారగడ్డి | గినీగడ్డి |
|---|---|---|---|
| రకములు | యస్.బి. 21<br>కో-1, కో-2<br>ఎ.పి.బి.యస్.1 | లోకల్ | గ్రీన్ పానిక్<br>గాటన్ పానిక్<br>పి.పి.జి. 14 |
| విత్తు సమయము | ఫిబ్రవరి-ఆగస్టు<br>నెలల మధ్యలో<br>చలికాలంలో తప్ప | జూన్-జూలై<br>దక్షణ భారతదేశంలో<br>ఎప్పుడైన | ఫిబ్రవరి ఆగస్టు<br>నెలల మధ్యలో<br>చలికాలంలో తప్ప |
| హెక్టారుకు కావలసిన నారు మొక్కలు | 22-30 వేల<br>కాండపు మొక్కలు,<br>ఒకసారి నాటితే<br>3-4 సం.లు<br>ఉంటుంది | 8-10 క్వింటాళ్ళ<br>బరువుగల కాండపు<br>ముక్కలు లేదా<br>30,000 నారు<br>మొక్కలు | 30-40 వేల నారు<br>మొక్కలు |
| నాటు పద్ధతి | వరుసలలో, వరుసల<br>మధ్య అంతరము<br>50-75 సెం.మీ. | వరుసలలో, వరుసల<br>మధ్య అంతరము<br>45-60 సెం.మీ | వరుసలలో, చాళ్ళ<br>మధ్య అంతరము<br>45-60 సెం.మీ. |
| ఎరువు<br>(హెక్టారుకు) | 150 కిలోల నత్రజని<br>60 కిలోల పొటాష్ | 150 కిలోల నత్రజని<br>60 కిలోల పొటాష్ | 150 కిలోల నత్రజని<br>60 కిలోల పొటాష్. |
| నీడి తడుపు | వేసవి కాలంలో<br>8-21 రోజులకు<br>ఒకసారి, చలి కాలంలో<br>15-20 రోజులకు<br>ఒకసారి | వేసవి కాలంలో<br>8-16 రోజులకు<br>ఒకసారి, చలి కాలంలో<br>15-20 రోజులకు<br>ఒకసారి | వేసవికాలంలో<br>8-10 రోజులకు<br>ఒకసారి, చలికాలంలో<br>15-20 రోజులకు<br>ఒకసారి |
| మొదటి కోత | నాటిన తర్వాత<br>60-75 రోజులకు | నాటిన తర్వాత<br>75-80 రోజులకు | నాటిన తర్వాత<br>50-60 రోజులకు |
| కోతలు | ప్రతి 40-45<br>రోజులకు ఒక్కసారి<br>5-6 కోతలు | ప్రతి 40-45<br>రోజులకు ఒక్కసారి<br>6-9 కోతలు | ప్రతి 40-45<br>ఒక్కసారి,<br>3-4 కోతలు |
| దిగుబడి | పచ్చిమేత 180-250<br>టన్నులు | పచ్చిమేత 180-250<br>టన్నులు | పచ్చిమేత 180-250<br>టన్నులు |

## పట్టిక 2 : ధాన్యపు రకము పచ్చిమేతల సాగు వివరములు

| సాగువివరములు | జొన్న | మొక్కజొన్న | స్వీట్ సూడాన్ గడ్డి |
|---|---|---|---|
| రకములు | పి.సి.6, పి.సి. 23<br>యంపి చారి, | ఆఫ్రికన్ టాల్, గంగ,<br>జవార్ | యస్.యస్.జి. 59-3 |
| విత్తు సమయము | వర్షాధారంగా<br>జూన్-ఆగస్టు<br>నీటి పారుదల క్రింద<br>జనవరి - మే | వర్షాధారంగా<br>జూన్-ఆగస్టు<br>నీటి పారుదల క్రింద<br>జనవరి - మే | వర్షాధారంగా<br>జూన్-ఆగస్టు<br>నీటి పారుదల క్రింద<br>జనవరి - మే |
| విత్తనాలు<br>(హెక్టారుకు) | 25-40 కిలోలు | 50-60 కిలోలు | 15 కిలోలు |
| విత్తు పద్ధతి | సాళ్ళలో, సాళ్ళ మధ్య<br>30సెం.మీ. అంతరం | సాళ్ళలో, సాళ్ళ మధ్య<br>30సెం.మీ. అంతరం | సాళ్ళలో, సాళ్ళ మధ్య<br>30సెం.మీ. అంతరం |
| ఎరువు<br>(హెక్టారుకు) | 80 కిలోల నత్రజని<br>30 కిలోల పోటాష్ | 120 కిలోల నత్రజని<br>120 కిలోల పోటాష్ | 80 కిలోల నత్రజని<br>30 కిలోల పోటాష్ |
| నీటి తడుపు | 10-15 రోజులకు<br>ఒకసారి | 10-15 రోజులకు<br>ఒకసారి | 10-15 రోజులకు<br>ఒకసారి |
| మొదటి కోత | విత్తిన తర్వాత<br>50-55 రోజులకు<br>(50శాతం పూతదశలో) | విత్తిన తర్వాత<br>60-70 రోజులకు<br>(కంకి వేసేటప్పుడు) | విత్తిన తర్వాత<br>55-60 రోజులకు |
| కోతలు | ప్రతి 35-40<br>రోజులకు<br>3 కోతలు | ప్రతి 60-70<br>రోజులకు<br>ఒక్క కోత | ప్రతి 30-35<br>రోజులకు<br>4-5 కోతలు |
| దిగుబడి | పచ్చిమేత 40-50<br>టన్నులు | పచ్చిమేత 40-50<br>టన్నులు | పచ్చిమేత 40-50<br>టన్నులు |

## పట్టిక 3 : కాయజాతి పచ్చి మేతల సాగు వివరములు

| సాగువివరములు | అలసందలు | లూసర్న్ | స్టైలో |
|---|---|---|---|
| రకములు | రష్యన్ జెయింట్<br>ఇ.సి. 4216,<br>యు.పి.సి. | టి. 9,<br>ఆనంద్ 2 | స్టైలో హమాట<br>స్టైలో స్కాబ్రా |
| విత్తు సమయము | జూన్-జూలై/<br>ఫిబ్రవరి-జూన్ | అక్టోబర్ -<br>నవంబర్ | జూన్-ఆగస్టు<br>(నీటి పారుదల క్రింద) |
| హెక్టారుకు కావలసిన విత్తనాలు | 30-40 కిలోలు | 10-15 కిలోలు | స్టైలో హమాట:20-25 కిలోలు<br>స్టైలో స్కాబ్రా: 10-15 కిలోలు |
| విత్తు పద్ధతి | వరుసలలో, వరుసల మధ్య అంతరము 45 సెం.మీ | సాళ్ళలో, సాళ్ళ మధ్య అంతరము 20-25 సెం.మీ | చల్లాలి |
| ఎరువు (హెక్టారుకు) | 20 కిలోల నత్రజని<br>60 కిలోల పొటాష్ | 30 కిలోల నత్రజని<br>100 కిలోల పొటాష్ | 35 కిలోల నత్రజని<br>60 కిలోల పొటాష్ |
| నీటి తడుపు | 12-15 రోజులకు | 2-3 తడుపులు, వారానికి ఒకసారి ఆ తర్వాత 10-12 రోజులకు | 20-30 రోజులకు |
| మొదటి కోత | నాటిన తర్వాత 55-60 రోజులకు (పూత దశలో) | నాటిన తర్వాత 70 రోజులకు | నాటిన తర్వాత 75-80 రోజులకు |
| కోతలు | ఒకటే కోత | ప్రతి 25-30 రోజులకు ఒకసారి 6-7 కోతలు | ప్రతి 35-40 రోజులకు ఒకసారి, 2 కోతలు |
| దిగుబడి | పచ్చిమేత<br>30-35 టన్నులు | పచ్చిమేత<br>60-70 టన్నులు | పచ్చిమేత<br>30-35 టన్నులు |

ఈ పద్ధతిలో మేపడం వల్ల పశువులకు కావలసినంత పశుగ్రాసం లభించి వాటి ఉత్పాదన నిలకడగా ఉంటుంది. బంజరు భూములలో గడ్డి జాతులేకాకుండా సుబాబుల్, గ్లైరిసిడియం, వేప, తుమ్మ, అవిశ, దిరిశెన, రావి, నల్ల తుమ్మ మొదలైన పశుగ్రాసంగా వాడుటకు ఉపయోగపడే చెట్లు కూడ నాటవచ్చు. దీనివల్ల వేసవికాలంలో, పచ్చగడ్డి దొరకనప్పుడు ఈ చెట్ల ఆకులు మరియు కాయలను పశువులకు మేతగా వాడుకోవచ్చును. ఈ చెట్ల ఆకులు మరియు కాయలలో గడ్డి జాతుల కంటే విలువైన పోషక పదార్థములు ఎక్కువగా ఉంటాయి మరియు వీటిని పశువులు చాలా ఇష్టంగా తింటాయి. ఇంతేకాక బత్తాయి, నారింజ, దానిమ్మ, మామిడి మొదలగు పండ్ల తోటలలో, చెట్ల మధ్య ఖాళీగా ఉన్న భూమిలో సింకరస్, స్టైలో, స్వీట్ సూడాన్, రోడ్స్, సిరాట్రో లాంటి గడ్డి జాతులను పెంచుకోవచ్చు. ఈ విధంగా అభివృద్ధి చేసుకున్న పండ్ల తోటలలో, రెండవ సంవత్సరము నుండి జీవాలను (గొర్రెలు/మేకలు) మేపవచ్చు. అంతేకాక సుబాబుల్, గ్లైరిసిడియం లాంటి చెట్లను పండ్ల తోటలలో ఒకవైపు సరిహద్దు వెంబడి ఒక వరుస నాటినట్లయితే, వాటి కొమ్మలను కోసి, ఆకులు మరియు కాయలను సాయంత్రం పూట మేతగా, దాణాకు బదులుగా ఉపయోగించుకోవచ్చు. ఈ పద్ధతి వల్ల పండ్ల తోటలలో కలుపు మొక్కల సమస్య పోవుటయే గాక, జీవాలనుండి కూడా ఆదాయం వస్తుంది. దీని వల్ల పండ్ల తోట రైతులు మరింత లాభ పడతారు.



**అభివృద్ధి పరచిన బంజరుభూమిలో గడ్డి మరియు గడ్డిజాతి చెట్లను మేస్తున్న దెక్కనిజాతి జీవాలు**



**మామిడి తోటలలో నెల్లూరు జాతి గొర్రెల పెంపకం**

పచ్చిమేతలను పొలంగట్టు మీద, ఇతర పంటల సాళ్ళ మధ్య, పండ్లతోటలలోను సాగు చేసుకోవచ్చు (పట్టిక 1, 2 మరియు 3). పశుగ్రాస సమస్యను అధిగమించుటకు వర్షాధారముగా సాగుచేయు సాలుసరి పశుగ్రాస పంటలను (జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసందలు, పిల్లిపెసర, ఉలవలు మొదలైనవి) మరియు బహువార్షిక పంటలను (సింకరస్, స్టైలో, స్వీట్ సూడాన్, రోడ్స్ మొదలైన గడ్డి జాతులతోపాటు సుబాబుల్, గ్లైరిసిడియం, వేప, తుమ్మ, అవిశ, దిరిశెన, రవి, నల్లతుమ్మ మొదలైన పశుగ్రాసంగా పనికి వచ్చే చెట్లను కూడా) తమ ప్రాంతానికి అనువైన వాటిని (నేల స్వభావం మరియు వర్ష రీతిని బట్టి) ఎంచుకొని సాగుచేసుకోవాలి. నీటి గుంటల గట్లమీద గినీ గడ్డిని పెంచుకొన్నట్లయితే వర్షాకాలంలో గట్లు తెగిపోకుండా కాపాడుకోవచ్చు మరియు దానివల్ల పశువులకు మేత లభిస్తుంది. సాగు నీరు ఉన్న రైతులు కో-1, కో-3, ఎ.పి.బి.ఎన్-1, నేపియర్, పార గడ్డి మొదలైన పచ్చిమేత గడ్డి రకాలను సాగు చేయవచ్చు. పశుగ్రాసం ఎక్కువగా లభించేకాలంలో, వృధాకాకుండా పచ్చిమేతను పాతర వేసుకోవడం (పాతర గడ్డి) కాని లేదా ఎండుమేతగా చేసుకొని కాని నిల్వచేసుకోవాలి. ఈ విధంగా నిల్వచేసుకున్న గడ్డిని అవసరాన్ని బట్టి వాడుకోవాలి.

## పశువులు, జీవాలు మరియు కోళ్ళ సంఖ్య

పశువుల మరియు జీవాల సంఖ్య ఆ ప్రాంతంలోని పశుగ్రాస ఉత్పత్తి, వాటి పోషకవిలువలు మరియు పశుగ్రాస నిల్వలకు లోబడి ఉండాలి. పాలు తక్కువ ఇచ్చే నాటు రకం పశువుల స్థానంలో, అధిక దిగుబడినిచ్చే మేలు జాతి పశువులను ఎంపిక చేసుకోవాలి. రోజుకు ఒక లీటరు పాలు ఇచ్చే పది పాడి పశువులకంటే, పది లీటర్లు ఇచ్చే ఒక్క పాడి పశువును పోషించడం చాలా లాభదాయకం మరియు తేలిక. ఎందుకంటే పది లీటర్లు పాలు ఇచ్చే ఒక పాడి పశువుకు కావలసిన పచ్చగడ్డి, ఎండుమేతను రైతు తనపొలంలోనే

సాగుచేసుకోవచ్చు. దానిని రోజు గమనించి మంచి చెడ్డలను తక్కువ సమయంలో చూడవచ్చు. అదే విధంగా, ఎక్కువ సంఖ్యలో నాటు రకం జీవాల పెంపకం కంటే కవల పిల్లలను ఇచ్చి తక్కువ కాలంలో అధిక బరువు పెరిగే కొన్ని మంచి జాతి జీవాలను ఉంచుకోవడం ఉత్తమం. కాబట్టి ప్రతిరైతు విధిగా తమకున్న ప్రాంతంలోని పశుగ్రాస ఉత్పత్తి మరియు వాటి పోషకవిలువలను బట్టి తగిన సంఖ్యలో పశువులను, జీవాలను పెంచుకోవాలి. 400 కిలోల బరువు ఉండే ముర్రా పాడి గేదెలకు/సంకరజాతి పాడి పశువులకు, ఇంట్లో కట్టివేసి పూర్తిగా పచ్చి మేతతో మేపటానికి వాటి పాల దిగుబడిని బట్టి రోజుకు 30-40 కిలోల పశుగ్రాసం కావాలి లేదా 5-6 కిలోల ఎండుగడ్డి, 10-15 కిలోల పచ్చిగడ్డి, దాణా (ఆవులకు ప్రతి 3 లీటర్ల పాలకు, గేదేలకు ప్రతి 2.5 లీటర్ల పాల దిగుబడికి ఒక కిలో చొప్పున దాణా) కావాలి. అదేవిధంగా 250-300 కిలోల బరువు ఉండే దేశవాళి నాటురకం పశువులకైతే 10-15 కిలోలు పశుగ్రాసపు మేత కావాలి లేదా 4-5 కిలోల ఎండుగడ్డి, 4-6 కిలోల పచ్చిగడ్డి మరియు పైన వివరించిన విధంగా దాణా కావాలి. ఈ విధంగా నీటి వసతి గల భూమిలో ఎకరానికి 5-6 లేదా వర్షాధార భూమిలో 2-3 ముర్రా పాడి గేదెలను/సంకరజాతి పాడి పశువులను పోషించవచ్చు. రోజుకి 4-6 గంటలు పచ్చిక బీళ్ళు మరియు బంజరు భూములలో మేసే పశువులకు కాలాన్ని బట్టి పైన చెప్పిన పశుగ్రాసంలో 40-60 శాతం మేత ఇంటివద్ద ఇవ్వటం ద్వారా నీటి వసతి గల భూమిలో ఎకరానికి 8-10 లేదా వర్షాధార భూమిలో 4-5 ముర్రా పాడి గేదెలను/సంకరజాతి పాడి పశువులను పోషించవచ్చు. కోళ్ళలో రెండు, మూడు దేశవాళి జాతి కోళ్ళతోపాటు ఐదు, ఆరు వనరాజ/గిరిరాజ/గ్రామ ప్రియ మొదలగు అభివృద్ధి పరచిన సంకరజాతి కోళ్ళను ప్రతి రైతు పెంచుకోవాలి.

## పాడి పశువుల పోషణ

ఎపుతోనే చేపు అన్నట్లు లాభదాయకమైన పాడి పశువులకు సంవత్సరం పొడుగున పశుగ్రాసాలు అత్యంత అవసరం. పాడికి ఆధారం పచ్చిమేత, అదిలేనిదే పాడి లాభసాటి కాదు. కేవలం ఎండుగడ్డి, చొప్ప మీద ఆధారపడి పాడి పశువులను పోషించితే ప్రయోజనం లేదు. ప్రతి రైతు తప్పని సరిగా తమకున్న పొలంలో పదవవంతు పశుగ్రాసం సాగుచేయడానికి ఉపయోగించాలి. పచ్చిమేత మేపిన పశువులలో పాల ఉత్పత్తి పెరిగి, ఖర్చులు తగ్గి రాబడి ఎక్కువ ఉంటుంది, మరియు పశువులు సకాలంలో ఎదకు వచ్చి, చూలు కట్టి ఈనుతాయి. పశువులకు కనీసం రోజుకు 8-10 కిలోల పచ్చగడ్డిని ఇవ్వాలి. ఎండుగడ్డిని అది తినగలిగినంత మేపాలి. పశువులకు వేయు పచ్చగడ్డిలో కనీసం 3వ వంతు పప్పు జాతి లేదా తీగజాతి గడ్డి రకాలను (ఉలవలు, అలసంద, లూసర్న్, బర్సీము, పిల్లిపెసర మొదలైనవి) మేతగా ఇవ్వాలి. పచ్చిమేత కొరతగా ఉన్నప్పుడు వరిగడ్డి/చొప్ప

**నేపియర్ పచ్చగడ్డి మేస్తున్న ఉస్మానిబాద్ మేకలు**





**సుబాబుల్ పచ్చిమేత మేస్తున్న ఉస్మానిబాద్ మేకలు**

మొదలగు ఎండుమేతలతో పాటు చెట్ల ఆకులు (సుబాబుల్, గ్లైరిసిడియం, వేప, తుమ్మ, అవిశ, దిరిశెన, రవి, నల్లతుమ్మ మొదలైనవి) 20-30 శాతంవరకు కలిపి మేపితే పాల దిగుబడి తగ్గదు, పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. వేసవి కాలంలో తగినంత మేత లేనప్పుడు పశువులు/జీవాలకు తగినంత దాణాను ఇవ్వాలి. దాణాను ఎవరికి వారు తమకు అందుబాటులో ఉన్న దినుసులను ఉపయోగించి తక్కువ ఖర్చుతో తయారుచేసుకొని పశువులకు ఇవ్వాలి. దాణా తయారీలో ధాన్యాన్ని (25-35 శాతం), వివిధ రకాల ధాన్యపు పొట్టును (పప్పు దినుసుల), తవుడు (గోధుమ/వరి) లాంటి ఉపపదార్థాలను (30-40 శాతం), నూనె గింజల చెక్కను (20-25 శాతం) దాణా దినుసులుగా తగినంత పరిమాణంలో వాడుకోవచ్చు. మొదట నూనె గింజల చెక్కను మరియు ధాన్యాన్ని గ్రైండర్‌లో వేసి పొడి చెయ్యాలి. దీనికి తవుడు, ఖనిజ లవణాల మిశ్రమం (2 శాతం) మరియు ఉప్పు (1 శాతం) లను కలపాలి. స్థానికంగా దొరికే

అందుబాటుని బట్టి, మార్కెట్ ధరలను బట్టి సాంప్రదాయ దినుసులకు ప్రత్యామ్నాయంగా సాంప్రదాయేతర వనరులను (పత్తి గింజల పొట్టు, మొక్కజొన్న కంకి పిప్పి మొదలైనవి) దాణా తయారీలో వినియోగించుకోవాలి. పాలదిగుబడికి పాడిగేదలలో ప్రతి 2.5 లీటర్ల పాలకు మరియు పాడి ఆవులలో ప్రతి 3.0 లీటర్ల పాలకు ఒక్క కిలో దాణాను అదనంగా పెట్టాలి మరియు 8 లీటర్ల కంటే ఎక్కువ పాలనిచ్చే పాడి పశువులకు చిన్నప్రేగులో అరుగుదల ఎక్కువగా ఉన్న బైపాస్ ప్రొటీన్లు అధికంగా ఉండే నూనె గింజల చెక్కను తగినంతగా ఇవ్వాలి.

ఈ క్రింద చూపిన విధంగా దాణా దినుసులను తగిన నిష్పత్తిలో ఉపయోగించి రైతులు తమ ఇంట్లోనే దాణాను తయారు చేసుకోవచ్చును.

| **దాణా దినుసులు (కిలోలలో)** | **దాణా రకాలు** | | | | | |
|---|---|---|---|---|---|---|
| | **1** | **2** | **3** | **4** | **5** | **6** |
| ధాన్యపు గింజలు | 30 | 20 | 20 | 30 | 37 | 27 |
| తవుడు (గోధుమ/వరి) | 32 | 50 | 37 | 47 | 10 | - |
| నూనె గింజల చెక్క (పల్లి/కొబ్బరి) | 25 | 20 | 20 | 20 | 20 | 25 |
| పప్పు దినుసుల పొట్టు | - | - | 20 | - | 30 | 25 |
| పత్తి గింజల చెక్క | - | - | - | - | - | 20 |
| బెల్లపుమడ్డి | 10 | 7 | - | - | - | - |
| ఖనిజ లవణాల మిశ్రమం | 2 | 2 | 2 | 2 | 2 | 2 |
| ఉప్పు | 1 | 1 | 1 | 1 | 1 | 1 |



**దాణా తయారీలో రైతు సోదరులు**

## పాడి పశువుల పునరుత్పత్తి

పాడి పశువులు సకాలంలో ఎదకు వచ్చి చూలు కట్టి ఈనితేనే లాభసాటిగా వుంటుంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పశువులను ఒకసారి పరిశీలించి ఎదను గమనించాలి. ఎదకు వచ్చిన తర్వాత సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించాలి. ఒక ఎద తప్పితే, 500 రూపాయలు విలువ గల ఉత్పత్తి నష్టపోవలసి వస్తుంది. మొదటిసారి గర్భధారణ చేసే పశువు బరువు కనీసం 250 కిలోలు ఉండేటట్లు మేపాలి. గర్భధారణ జరిగిన 90 రోజుల లోపల చూడి పరీక్ష చేయించాలి. సంకర జాతి పశువులు 15 మాసాలకు, గ్రేడెడ్ ముర్రా గేదెలు 2-3 సంవత్సరాలకు, దేశవాళి గేదెలు మరియు ఆవులు 3-4 సంవత్సరాల వయస్సులో మొదటిసారి ఎదకు రావాలి.

**పట్టిక 4 : పాడి పశువుల పునరుత్పత్తి క్రమము**

| పునరుత్పత్తి క్రమము | దేశవాళి ఆవు | సంకరజాతి ఆవు | ముర్రా గేదెలు |
|---|---|---|---|
| మొదటి సారి ఎదకు వచ్చేవయస్సు | 3-4 సం.లు | 14-18 మాసాలు | 2.5-3.5 సం.లు |
| ఎదకు, ఎదకు మధ్యకాలం | 21 రోజులు | 21 రోజులు | 21 రోజులు |
| ఎదకాలం (గంటలు) | 18-24 | 18-24 | 18-36 |
| చూలు కాలం (రోజులు) | 280 | 280 | 310 |
| మొదటి ఈత వయస్సు | 4-5 సం. | 2-3 సం. | 3.5-4.5 సం. |
| ఈతకు,ఈతకు మధ్యకాలం | 2 సం.పైన | 12-14 మాసాలు | 14-16 మాసాలు |
| ఈతలో పాడికాలం | 200 రోజులు | 300 రోజులు | 300 రోజులు |
| సరాసరి పాల ఉత్పత్తి | 1-2 లీటర్లు | 8-10 లీటర్లు | 6-10 లీటర్లు |

సంకరజాతి ఆవు అయితే 2-3 సంవత్సరాలలోపు, గ్రేడెడ్ ముర్రా గేదె అయితే 3-4 సంవత్సరాలలోపు మొదటి ఈత ఈనాలి. ఈతకు ఈతకు మధ్యకాలం 12-14 మాసాలకు మించకూడదు. 10 సంవత్సరముల వయస్సులో కనీసం 5-6 ఈతలు ఈనాలి. పాడికాలంలో అనగా 10 నెలలో 1800-2000 లీటర్లకు తక్కువగా కాకుండా పాల దిగుబడి ఇవ్వగల్గేటట్లు మేపాలి. చూడి పశువు పోషణకు పెట్టిన ఖర్చు ముమ్ముందు పొందబోయే లాభాలకు పెట్టుబడి అని రైతులు భావించాలి. చూడి పశువు ఈనటాన్కి రెండు నెలల ముందు నుండి రోజుకు 1-2 కిలోల దాణా మరియు మంచి పచ్చిగడ్డిని

మేతగా ఇవ్వాలి. చూడి పశువు ఈనటానికి రెండు నెలల ముందునుండి క్రమంగా పాలు పితకడం మాని వేయాలి. పొదుగు వాపు వ్యాధి రాకుండా పాడిపశువులలో జాగ్రత్త వహించాలి. పరిశుభ్రమైన పాల ఉత్పత్తికి పశువులు మరియు పాలు పితికే వ్యక్తి శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలి. పాలు నిల్వ చేసే పాత్రలు మరియు పరిసరాలు కూడ శుభ్రంగా ఉండాలి.


పొదుగు వాపు వ్యాధి సోకిన పొదుగు

పాడి పరిశ్రమలో పాలు పితకడం చాలా ముఖ్యమైన పని. పాలు పితకే విధానం బట్టి పాల నాణ్యత మరియు పొదుగువాపు వ్యాధి రావటం ఆధారపడి ఉంటుంది. పాల ధర దాని నాణ్యత (శుభ్రత మరియు పాలు చెడిపోకుండా నిల్వఉండే సమయం) మీద ఆధారపడి ఉంటుంది. శుభ్రమైన పాలను శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజి) సదుపాయం లేకుండా ఎక్కువ సమయం నిల్వచేసుకోవచ్చును. కాబట్టి రైతులు పరిశుభ్రమైన పాకలో, ఆరోగ్యవంతమైన పాడిపశువు నుండి పాలు ఉత్పాధనచేసి అధికలాభాలను ఆర్జించవచ్చును.

- ఆరుబయట పాలు పితకటంవల్ల దుమ్ము, దూళి పాలల్లో కలసి పాల నాణ్యత తగ్గి, తొందరగా పాడవుతాయి, కాబట్టి పాలను పాకలోనే పితకాలి. పాలు పితికే పాకను ప్రతి రోజు కడిగి శుభ్రంగా ఉంచుకోవాలి.
- పాడిపశువు వెనక కాళ్ళ లోపలి వైపు మట్టి, పేడ ఎక్కువగా అతుక్కొని ఉంటుంది కాబట్టి ప్రతిరోజు పాలు పితకటానికి ముందు బ్రష్‌తో అక్కడ శుభ్రంగా కడగాలి.
- ప్రతిరోజు పాలు పితకటానికి ముందు పొదుగును శుభ్రంగా గోరువెచ్చని నీటితో కడిగి, పొడిగుడ్డతో తుడవాలి.
- మొదటి పాలదారలను స్ట్రిప్ కప్పులోకి వదలి, పొదుగువాపు వ్యాధి ఉన్నది/లేనిది నిర్ధారణ చేసుకోవాలి.
- పాలు పితికిన తర్వాత చనుమొనలను డిటర్జంట్ శానిటైజింగ్ నీళ్ళలో ఒక్కసారి డిప్ చెయ్యాలి.
- పాలు పితికే వ్యక్తి పరిశుభ్రమైన దుస్తులు ధరించి, తలకు టోపి (జుట్టురాలి పాలల్లో పడకుండా) పెట్టుకోవాలి.
- పాలు పితికే వ్యక్తి తన గోళ్ళను క్రమం తప్పకుండా కత్తిరించుకోవాలి. పాలు పితికే వ్యక్తి పితకటానికి ముందు తన చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.

## లేగదూడల యాజమాన్యం మరియు పోషణ

నేటి పెయ్యదూడలే రేపటి పాడిపశువులు, అవి రాబోయే రోజులలో పాల ఉత్పత్తికి పునాదులు. పెయ్యదూడల పోషణలో ఏమాత్రం అశ్రద్ధ చేసినా రాబోయే రోజులలో దాని పాల ఉత్పత్తి సామర్థ్యాన్ని నష్టపోవలసి వస్తుంది. మొదటి 3-4 మాసాల వయస్సు అత్యంత కీలకమైనది. ఈ దశలో దానికిచ్చే పోషణ, మేపు సక్రమంగా ఉండేటట్లు చూడాలి. పుట్టిన వెంటనే 6 గంటల లోపు జున్ను పాలు త్రాగేటట్లు చూడాలి. పుట్టిన తర్వాత మొదటి 3 రోజుల వరకు తగినన్ని జున్నుపాలు త్రాగనివ్వాలి. దాని శరీర బరువుని బట్టి 3 మాసాల వరకు తగినన్ని పాలు తల్లి దగ్గర త్రాగ నివ్వాలి. (మొదటి నెలలో రోజులకు 2-2.5 లీటర్ల చొప్పున, రెండవ నెలలో 2.5-3.0 లీటర్ల చొప్పున ఆ తర్వాత 3వ నెలలో 3.5 లీటర్ల చొప్పున పాలు దూడకు వదలాలి). దూడలకు దాణాను మొదటి 2 నెలల వయస్సు వరకు రోజుకు 150-200 గ్రాములు, 3 వ నెల నుండి 300-400 గ్రాములు, 4వ నెల నుండి 500-600 గ్రాములు, 5-6 నెలల వయస్సు నుండి 750-850 గ్రాములు, 7వ నెల నుండి 1 కిలో వరకు దాని శరీర బరువుని బట్టి కొద్దిగా బెల్లం కలిపి పెట్టవలెను.



**లేగదూడల పోషణ**

దూడకు 15 రోజుల వయస్సు నుండి లేత పచ్చగడ్డి మేత తినడం అలవాటు చేయాలి. 3వ నెల వయస్సు నుండి పచ్చిమేత మరియు ఎండుగడ్డి మేపాలి. దూడలకు వారం లోపల మొదటిసారి, తర్వాత ప్రతినెల కొకసారి నట్టల మందు త్రాగించాలి.

నేటి లేగదూడల ఆరోగ్య సంరక్షణ రేపటి పాడి పశువుల పెరుగుదల మరియు పాల ఉత్పాదన శక్తిని చాలా ప్రభావం చేస్తుంది, కాబట్టి లేగ దూడల ఆరోగ్య సంరక్షణలో తగు జాగ్రత్త వహించాలి. లేగ దూడలలో సరియైన ఎదుగుదల లేకపోవడం, ఎప్పుడు రోగాల బారినపడి ఉండటం, వివిధ రోగాలు దూడల నుండి పాడిపశువులకు సోకడం మొదలైన వాటివల్ల రైతులు చాలా ఆదాయాన్ని నష్టపోవాల్సి వస్తుంది. ప్రతి రైతు లేగ దూడలకు వచ్చే మూడు ముఖ్యమైన వ్యాధుల నుండి తగు ఆరోగ్య సంరక్షణను కల్పించాలి.

**సెప్టిసీమియా :** ఈవ్యాధి దూడ పుట్టక ముందే, తల్లి గర్భాశయంలో ఉన్నప్పుడే సూక్ష్మజీవుల వల్ల సోకుతుంది. వ్యాధి సోకిన దూడలు పాలు త్రాగవు, ఎండిపోతుంటాయి, చాలా

నీరసించి నిలబడలేక పడిపోతుంటాయి. ఈవ్యాధి నివారణకు యాంటిబయొటిక్ మందులను దగ్గరలో ఉన్న పశువైద్యున్ని సంప్రదించి వాడాలి.

**విరోచనాలు :** ఈవ్యాధి ఎక్కువగా లేగదూడలలో పుట్టిన ఒకనెల లోపు వస్తుంది. వ్యాధి సోకిన దూడలలో రక్తం కలిసిన విరోచనాలు ఎక్కువగా అవుతాయి, దూడలు పాలు త్రాగక నీరసించిపోతాయి. ఈవ్యాధి నివారణకు యాంటిబయొటిక్ మందులతోపాటు శరీరంలో నీటి శాతంను అదుపులోఉంచే ద్రవాలను దగ్గరలో ఉన్న పశువైద్యున్ని సంప్రదించి వాడాలి.

**న్యుమోనియా (దమ్మురోగం) :** దూడలను గాలి మరియు వెలుతురు సరిగాలేని, తేమ ఎక్కువగా ఉన్న పాకల్లో ఉంచడం వల్ల ఈవ్యాధి వచ్చి ఊపిరితిత్తులు పాడుఅవుతాయి. దూడలలో ఈవ్యాధివల్ల ముక్కునుండి పచ్చని చీమిడి కారుతుంది, బాగా దగ్గువస్తుంది. దూడలకు జ్వరం వచ్చి ఊపిరి తీసుకోవటంలో, పాలు త్రాగటంలో ఇబ్బంది పడతాయి. ఈవ్యాధి నివారణకు యాంటిబయొటిక్ మందులను దగ్గరలో ఉన్న పశువైద్యున్ని సంప్రదించి వాడాలి.

## పశువుల గృహవసతి

గ్రామీణ వాతావరణానికి అనుగుణంగా తగినంత స్థలంలో విశాలంగా ఆధునిక పాకను/కొట్టామును ఏర్పాటు చేసుకోవాలి. పాడి పశువుల పాకలను ఏత్తైన ప్రదేశంలో గాలి వెలుతురు బాగా వచ్చే, నీళ్ళు నిలవని చోట ఏర్పాటు చేసుకోవాలి. పశువుల పేడ, మూత్రము, పశువులను కడిగిన నీళ్ళు పాకలో నిల్వవుండకుండా పోయ్యేటట్లు తగిన ఏర్పాటు చేసుకోవాలి. పాక/కొట్టము చుట్టుపక్కల చెట్లు నాటాలి. కొట్టము/పాకలో ఖనిజ లవణపు ఇటుకలు ఎల్లప్పుడు ఉంచాలి. గోమారిలు మరియు పిడుదులు రాకుండా చూసుకోవాలి.

## పశువుల ఆరోగ్య సంరక్షణ

పశువులకు సోకే వివిధ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్త వహించాలి. ఎందుకంటే వ్యాధుల వల్ల పశువులలో పని పాటవు శక్తి మరియు పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఇటువంటి వ్యాధులలో ముఖ్యమైనవి గొంతువాపు, జబ్బవాపు మరియు గాలికుంటు వ్యాధి. ఈ వ్యాధులు సోకడంవల్ల లేగదూడలు, పెయ్యలు, పడ్డలు ఎక్కువ సంఖ్యలో మరణిస్తాయి, పాడి పశువులలో పాల దిగుబడి తగ్గి ఆర్థిక నష్టం కలుగుతుంది. చూడి పశువులలో పిండము పడిపోవచ్చు. దుక్కెటి (దున్నె) పశువులకు వ్యాధులు సోకడం వల్ల సేద్యపు పనులకు అంతరాయం కలుగుతుంది. ఇటువంటి వ్యాధులు ఒకసారి సోకిన తరువాత చికిత్స వల్ల అంతగా ప్రయోజనం ఉండదు. పశువులు తిరిగి కోలుకున్న వాటి ఉత్పాదన

శక్తి మరియు సామర్థ్యం తగ్గిపోతుంది, దీర్ఘకాలం ప్రభావాన్ని చూపిస్తాయి. కావున వ్యాధులు రాకముందే సరైన సమయంలో రోగనిరోధక టీకాలు పట్టికలో చూపిన విధంగా వేయించడం వల్ల చికిత్సకు అయ్యే ఖర్చు నుండి బయటపడవచ్చు. అధిక పాలు ఇచ్చే పాడి పశువులలో పాల జ్వరము ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధి పాడి పశువులలో ఈనిన మొదటి వారంలోనే కాల్షియం ధాతువు లోపం కారణంగా వస్తుంది. కాబట్టి పశువులకు ఖనిజ లవణాల మిశ్రమాన్ని తగినంతగా దాణాలో కలపాలి.



**పశువులలో గాలి కుంటు వ్యాధి లక్షణాలు**



**గొంతువాపు వ్యాధి సోకిన ఆవు గొంతు వాస్తుంది**



**గాలికుంటు వ్యాధి సోకిన ఆవు నోటి నుండి చొంగ కారుతుంది**

**పట్టిక 5 : పాడి పశువులలో వచ్చే వ్యాధుల నివారణకు ఇచ్చే టీకాల వివరాలు**

| టీకా పేరు | మొదటి సారి ఇవ్వాల్సిన వయస్సు | మోతాదు | తిరిగి చేయాల్సిన సమయం |
|---|---|---|---|
| గాలికుంటు వ్యాధి | 2 నెలలు | 2-3 మి.లీ. కండరంలోనికి | 9 నెలల తర్వాత |
| గొంతువాపు వ్యాధి | 6 నెలలు | 2-3 మి.లీ. చర్మం క్రింద | 12 నెలల తర్వాత |
| జబ్బవాపు వ్యాధి | 6 నెలలు | 5 మి.లీ. చర్మం క్రింద | 12 నెలల తర్వాత |

## జీవాల పోషణ మరియు యాజమాన్యం


జీవాలకు వేసవికాలంలో దొరికే (సుబాబుల్, రావి, నల్లతుమ్మ మొదలైన) చెట్ల ఆకులు మరియు కాయలతోపాటు దాణాను కూడా వాటికి దొరికే మేతను బట్టి తప్పని సరిగా ఇవ్వాలి. అంతేకాక వాటికి జత కలిసే కాలంలో మరియు చూడితో ఉన్నప్పుడు అదనంగా దాణాను ఇవ్వాలి. ఒకే మందలోని విత్తనం పొట్టేళ్లను ఏళ్ళతరబడి ఆడ జీవాలతో జత కలపడంవల్ల కొన్ని చెడు లక్షణాలు తర్వాత తరంలోని పిల్ల జీవాలకు వస్తాయి. అందువల్ల కనీసం ప్రతిరెండు సంవత్సరాలకు ఒకసారి విత్తనం పొట్టేళ్ళను వేరే ప్రాంతపు రైతుల పొట్టేళ్ళతో మార్పిడి చేసుకోవాలి. జీవాలకు క్రమం తప్పకుండా ప్రతి 3 నెలలకు ఒకసారి నట్టల మందు త్రాగించాలి. ఒకసారి వాడిన మందు మరల మరల వాడకుండా వేరేమందు వాడాలి ఇందువల్ల నట్టలలో నిరోధక శక్తిని అదుపులో ఉంచవచ్చు. జీవాలు ఉన్న కొట్టములో నల్లులు, పిడుదులు మొదలైనవి లేకుండా చూసుకోవాలి. జీవాలకు అంటువ్యాధులు రాకుండా గాలికుంటు, అమ్మతల్లి, పెద్దరోగం, చిటుక రోగం మొదలైన రోగాలకు ముందుగానే పట్టికలో చూపిన విధంగా టీకాలు వేయించాలి.



బొబ్బ (అమ్మతల్లి) వ్యాధి లక్షణాలు



గొర్రెలలో నీలి నాలుక వ్యాధి లక్షణాలు




**పట్టిక 6 : జీవాలలో రోగనిరోధక టీకాల సూచిక**

| టీకాలు వేయించాల్సిన నెల | టీకా రకము |
|---|---|
| జనవరి........................................ | దగ్గు రోగం |
| మార్చి........................................ | గొంతు వాపు వ్యాధి |
| ఏప్రిల్........................................ | బొబ్బ రోగం (అమ్మ తల్లి) |
| జూన్........................................ | పారుడు రోగం |
| జూలై........................................ | జబ్బ రోగం |
| ఆగస్టు........................................ | గాలికుంటు వ్యాధి |
| సెప్టెంబర్........................................ | చిటుకు రోగం |

## పెరట్లో పెంచే కోళ్ళ పోషణ మరియు యాజమాన్యం

సంకరజాతి కోళ్ళు కూడ దేశవాళి కోళ్ళలాగే పెరట్లో దొరికే క్రిమికీటకాలు మరియు మిగిలిపోయిన, పడవేసిన ఆహారపదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి. దీనివల్ల రైతులకు తమ ఇంటి వద్దనే పౌష్టిక ఆహారం (గ్రుడ్లు, మాంసం) లభిస్తాయి లేదా అమ్ముకోవడం వల్ల కొంత నిలకడైన ఆదాయం వస్తుంది. ప్రతి 8–10 కోడి పెట్టలకు ఒక పుంజును పెంచుకోవాలి. ఈ కోళ్ళకు సాయంత్రం ఇంటికి రాగానే కొంచెం ఏదైన ధాన్యాన్ని కాని దాణాని కాని అదనంగా ఇవ్వటం వల్ల మరింత అధిక లాభం పొందవచ్చు. సాధారణంగా ప్రతి ఇంట్లో లభించేటటువంటి రాగులు, జొన్నలు, నూకలు, బియ్యపు పొట్టు మొదలైన



వాటిని పొడి చేసుకొని మిశ్రమంగా తయారు చేసుకొని దాణాగా కూడా ఇవ్వవచ్చును. ఈ విధంగా తయారు చేసుకున్న దాణాకు తగినంత ఖనిజ లవణ మిశ్రమంను కలుపుకోవాలి. ఈ జాతి కోళ్ళు 6.0 నుండి 6.5 నెలల వయస్సులో లైంగికంగా పరిపక్వతకు వచ్చి గ్రుడ్లు పెట్టడం మొదలు పెడతాయి. వీటి గ్రుడ్లను దేశవాళి కోళ్ళ ద్వారా పొదిగించి పిల్లలను చేసుకోవచ్చు. గ్రుడ్లు పెట్టే కోళ్ళకు అదనపు కాల్షియమును ఖనిజలవణ మిశ్రమంగా కాని లేదా సున్నపు పొడి/గవ్వల పొడి రూపంలో కాని ప్రతి కోడికి 3-4 గ్రాములు అదనంగా ఇవ్వాలి. వీటికి రోగాలు రాకుండా క్రమం తప్పకుండా ఈ క్రింద చూపిన విధంగా టీకాలు వేయించాలి.

**పట్టిక 7 : కోళ్ళలో వ్యాధుల నివారణకు టీకాలు**

| వయస్సు రోజులలో | టీకా | మోతాదు | ఇచ్చే పద్ధతి |
|---|---|---|---|
| 1 | మారెక్స్ రోగము | 0.20 మి.లీ | ఇంజెక్షన్ ద్వారా |
| 7 | కొక్కెర రోగము (లసోట) | ఒక్క చుక్క | కళ్ళలో |
| 18 | కొక్కెర రోగము (లసోట) | ఒక్క చుక్క | కళ్ళలో |
| 28 | కొక్కెర రోగము (ఆర్2బి) | 0.20 మి.లీ. | ఇంజెక్షన్ ద్వారా |

మరల ప్రతి ఆరు నెలలకి ఒకసారి కొక్కెర రోగము (ఆర్2బి) టీకాను ఇవ్వవలెను.

ఈ విధంగా పైన చెప్పిన ఆధునిక శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించటంతోపాటు పశువులకు మరియు జీవాలకు భీమా చెయ్యడంవల్ల, ప్రకృతి వైపరిత్యాలు మరియు అంటు రోగాల వల్ల మరణాలు సంభవించినా రైతులు నష్టపోకుండా నిలకడైన లాభాలను ప్రతి సంవత్సరము పొందవచ్చును.

-0-



మరిన్ని వివరాలకు సంప్రదించండి :


**కృషి విజ్ఞాన కేంద్రము**

హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 040-24200732

**కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ**

సంతోష్‌నగర్, సైదాబాద్ P.O., హైదరాబాదు - 500 059. ఫోన్ : 040-24530161, 24530177